

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 13 సెప్టెంబర్, 2016 సంచిక : 4

**సంస్థాపకులు :**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా.......... రూ॥ 160/-

ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126.

**Ph : 9440413455, 9848133565**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........................................ 2

గురుసన్నిధికి అమ్మ ........................ 7

జగద్గురు తత్త్వబోధక స్వామి .... 17

శ్లోకవాణి ........................................ 20

లేఖావాణి ........................................ 22

షిరిడీ డైరీ ........................................ 23

సంస్మరణ సభ .................................. 25

సాకోరీ మహర్షి .................................. 26

శ్రీ గజానన విజయం ........................ 30

మంగళాక్షతలు .................................. 32

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com







## మా వాణి



### ఎన్నేళ్లాయె!

ఒకసారి హేమాడ్‌పంతు సాయినాథుల వారికి పాదసేవ చేస్తూ కూర్చొని ఉన్నాడు. అప్పుడు దీక్షిత్ వచ్చి "సాఠే గురుచరిత్ర ఒక సప్తాహము చేసినాడు అతడు ఊరకొనవలెనా, మరియొక సప్తాహము చేయవలెనా?" అని అడిగితే - శ్రీ సాయి "ఇంకొక్క సప్తాహం చేస్తే చాలు- అతడు పావనుడగును" అన్నారు. అది విన్న హేమాడ్పంతు "నేను నలుబది సంవత్సరముల నుండి చేయుచున్నాను. నాకేమియు ఫలితము లేదా? ఒక్క వారములో అతనికి ముక్తి కలుగుచున్నదే!" అని బాధపడ్డాడు. (అటుపైన అతని ఆ భావన గుర్తించిన సాయిబాబా అతడిని శ్యామా యింటికి పంపించటం వేరే కథ.)

హేమాడ్పంతు నలభై ఏళ్లుగా పారాయణ చేసాడు-నిజమే. అది మెచ్చదగినదే. అయితే-అందులో నిశ్చలబుద్ధితో, నిర్మలచిత్తంతో చదివినది ఎంతకాలం? అందులోని కథలను మనసులో ముద్రించుకొన్నది ఎంతకాలం? మనసా అనుభవిస్తూ, అప్పటి పాత్రలను, వారి తీరుతెన్నులను (కనులతో చెయ్యలేం గనుక) మనసులో దృశ్యీకరించుకొంటూ, అక్కడి సంభాషణాసారాన్ని మెదడులో పదిలపరుచుకోవాలి. ఆ సంఘటన జరుగుతున్నపుడు అక్కడ మనం కూడా ఉన్నంతగా ఆ పంక్తులు మనలో ముద్రించుకుపోవాలి. మళ్లీ ఎప్పుడు, ఎక్కడ ఆ సందర్భం ప్రస్తావనకు వచ్చినా - ఆ మొత్తం దృశ్యం మన కనులముందు సాక్షాత్కరించాలి. అప్పడది పారాయణవుతుంది. కొన్నికొన్ని కాలగతితో మరుగునపడినా కనీసం రేఖామాత్రంగానైనా గుర్తుండిపోతాయి. ఈ ప్రక్రియంతా జరగ

కుండా అలవాటుగా, ఆచారంగా రోజూ చదివేస్తే ఏం లాభం? ఆ చదివిన దాని సారం మన ఉచ్ఛ్వాస, నిశ్వాసాలతో ఎలా మమైక్యం అయిపోతుంది?

గురుదేవులు ఒక విషయం చెప్తుండేవారు-ఒక మహనీయుడనదగిన పెద్దమనిషి ఒక నగరానికి వెళ్లారు. అక్కడ ఒక వృద్ధుడు నిత్యం రామాయణ పారాయణ చేయటం చూచి, ఎంతో సంతోషంగా ఆయన దగ్గరకు వెళ్లి తామెంతకాలంగా పారాయణ చేస్తున్నారని అడిగితే ఐదు దశాబ్దాలుగానని జవాబు వచ్చింది. "శ్రీరాముని గుణాలలో తామేది యిష్టంగా స్వీకరించారు?" అని ప్రశ్నించారీ పెద్దమనిషి. వృద్ధుడు మండిపడి "ఏమయ్యా, నీ అహంకారం? శ్రీరాముడు పరమాత్ముడు. ఆయన లక్షణాలు మనకెలా వస్తాయి? పుణ్యం కోసం పారాయణ చేస్తాం గానీ ఆ దైవాన్ని అనుకరించగలమా?" అని కోప్పడ్డాడు. మన పెద్దమనిషి దిగ్భ్రాంతుడై, "అయ్యో, ఎంత జీవితం వ్యర్థం చేసుకున్నారీయన!" అని బాధపడ్డాడు.

స్థూలంగా మనం "ఇంతకాలం యీ పనిచేసాం" అని లెక్క కట్టుకొంటాం. కానీ, ఆ పని ఎంతకాలం ఏకాగ్రచిత్తంతో చేస్తామో అదే అసలైన లెక్క. మా తండ్రిగారు చెప్తుండేవారు-"మీరు నాలుగు పీరియడ్‌లు పాఠాలు చెప్పామంటారు. ఆ నాలుగు పీరియడ్‌ల సమయంలో మీరు వరండాల్లో ఎదురైన టీచర్లతో ఎంతసేపు మాట్లాడుతూ గడిపారు. మధ్య మధ్య ఫోన్‌లు వస్తే ఎంతసేపు మాట్లాడారు-ఏ తలనొప్పో ఉంటో ఎంతసేపు ఊరికే కూర్చున్నారు-యివన్నీ లెక్కలోకి తీసుకొని చూడండి-ఎంత సమయం వృధా చేసారో తెలుస్తుంది" అని. సరైన ప్రిపరేషన్ లేకుండా క్లాసుకు వెళ్లి అక్కడ తడుముకొంటూ పుస్తకంలో వెదుక్కొనే సమయం కూడా యిందులో కలుపుకోవచ్చు. అలాగే మన పారాయణలో కూడా అనేకాగ్రత, ఏవో శబ్దాల వినికిడి, అక్షరాలు మాత్రం చదువుతూ భావన అందుకోని తనం - యివన్నీ ఒక ఎత్తు. మనం ఏమి చదివాము, దాని





నుండీ ఏమి నేర్చుకోవాలి అన్న ఆలోచన లేకుండా - ఎన్నిసార్లు చదివామన్నదే లెక్క పెట్టుకొంటూ ఉండటం మరో ఎత్తు. ఇవన్నీ మినహా యిస్తే మనం పారాయణ ఎంతకాలం చేసినట్లో తేలుతుంది. ఇది ఒక అంశం. మరో అంశమేమిటంటే -

పారాయణను పెద్దలు విధించింది దేనికీ - అన్న విషయం ఆలోచిద్దాం. మనం చిన్నపిల్లలప్పుడు మనచేత రామాయణంలోవీ, భాగవతంలోవీ మంచిపద్యాలు చదివించేవారు. శతకపద్యాలు చెప్పేవారు. నీతివాక్యాలు వల్లింపజేసేవారు. అవన్నీ అంటూ అంటూ ఉంటే - అవి మన బుర్రల్లో రిజిస్టరై ఎప్పుడో ఒకప్పుడు ఆచరణలోకి వస్తాయన్న ఆశ మన పెద్దలది. అలాగే పారాయణ కూడా చేస్తూ చేస్తూ, ఆ గ్రంథసారాన్ని మెదడుకెక్కించుకొని క్రమంగా ఆచరణలోకి తెచ్చుకోవాలన్నది అసలు ఉద్దేశ్యం. అది నెరవేరకపోతే చదవడం వ్యర్థమే-కాదనగలమా? అయితే ఎన్నాళ్ళు చెయ్యాలి?-అన్నది ప్రశ్న. దానికి పరీక్షిత్తు ఉదాహరణ- చిన్న కథ చెప్పేవారు మన గురుదేవులు.

ఓ రాజుగారు తనకు తోచనప్పుడు, ఖాళీగా ఉన్నప్పుడు-తన ఆస్థాన పౌరాణికుడిని పిలిచి భాగవతం చదివి వినిపించమనేవారు. ఆయన కూడా పిలవగానే వచ్చి వినిపించేవాడు. అలా ఏడేళ్లు గడిచిపోయాక రాజుగారికొక సందేహం వచ్చింది. పరీక్షిత్తుకు వారం రోజుల్లోనే ముక్తి కలిగింది. నాకేమో ఏడేళ్లైనా ఏమీ జరగలేదు-ఈ పౌరాణికుడు ఏదో నాకు చెప్పకుండా దాస్తున్నాడేమో అంతర్గత రహస్యం అనుకొని వెంటనే అతన్ని పిలిపించాడు. "ఇంకా నాకెందుకు విముక్తి కలగటం లేదు ఆ రహస్యం చెప్పకుంటే తలతీయిస్తాను" అన్నాడు. ఆయన యింటికి వెళ్లి విచారంగా కూర్చుంటే ఆయన కూతురు తండ్రిని ఓదార్చి మరునాడు రాజస్థానానికి స్వయంగా వెళ్లింది. రాజు ప్రశ్నకు తానే జవాబిస్తానన్నది. మొదట తననొక స్తంభానికి కట్టివేయించమన్నది. అటుపైన రాజుగారిని

వేరొక స్తంభానికి కట్టి వేయించుకోమన్నది. అలా జరిగాక "మహారాజా, మీరు వచ్చి నా కట్లు విప్పండి" అన్నది. "ఎలాగమ్మా, నన్ను కట్టేసారుగా!" అన్నాడు రాజు. ప్రభూ! మీరు మా నాన్నగారిని అడిగిన ప్రశ్నకిదే జవాబు" అన్నది ఆ యువతి. "అదెలాగంటారా, మహారాజా! - ఆమె వివరించిందిలా-

"మీరు ప్రభువులు మీ మనసు నిరంతరం రాజ్యవ్యాప్తి, ప్రజాపాలన, కుతంత్రాలు, కుట్రనెదుర్కోవటం, రకరకాల అంతఃపుర సమస్యలు వీటన్నింటితో బద్ధమై ఉంటుంది. ఎన్నెన్ని చిక్కుముళ్లో మిమ్మల్ని కట్టేస్తాయి. ఎప్పుడో మనసు చెదిరినప్పుడో, తీరిక కుదిరినప్పుడో తప్ప దైవం గుర్తు రాడు, భాగవతం వినరు. ఇక మా తండ్రిగారి సంగతంటారా - వారు సంసారబద్ధులు. మీకు భగవత్కథ వినిపిస్తే తమకేదో లబ్ధి మీ ద్వారా దొరుకుతుందన్న భావంతో అర్ధరాత్రీ, అపరాత్రీ మీరు పిలిచినప్పుడల్లా వచ్చి చదువుతుంటారే తప్ప భాగవతం పట్ల ఆయనకు ఏకాగ్రత లేదు. ఒక బద్ధుడు మరో బంధితుడిని ముక్తుడిని చెయ్యలేడని మీరే అన్నారు గదా ప్రభూ? ఇక పరీక్షిత్తంటారా - ఒక్క వారమే తనకు మిగిలిన ఆయువని తెలిసింది. అంచేత మిగిలినవన్నీ విడిచిపెట్టి తాను వినే విషయంపై మనసు స్థిరంగా నిలిపి, వాటిలో లీనమై విన్నాడు. ఇక వినిపించిన శుకమహర్షి జన్మముక్తుడే. ఆయనకే బంధాలు లేవు. అందుచేత ఆ యిద్దరి మధ్యా శ్రవణం మననమై సఫలమైంది. అదీ సంగతి మహా ప్రభూ!"

అది విన్న ప్రభువు ఆనందించి ఆమెను సత్కరించి పంపించాడు. దీన్నిబట్టి పారాయణ ఉండవలసిన విధమేమిటో మనకు అర్థమైంది గదా! సాతే వారం రోజులపారాయణతోనే సఫలీకృతుడైన రహస్యం అదీ. మనం జన్మముక్తులం కాము. కానీ, ముక్తులం కావాలన్న తీవ్ర కాంక్ష మనలో ఉండి తీరాలి. అప్పుడే సత్ఫలితం కలుగుతుంది. అసలు పారాయణే కాదు - ఆరాధనైనా అంతే. పూజ చేసినపుడు మన మనసు విగ్రహాన్ని అలంకరించుకొని చూచి ఆనందించడంలో పరవశిస్తోందా? సర్వేశ్వర స్మృతి ఉంటున్నదా? మనం శాస్త్రోక్తంగా పూజించగలుగుతున్నామన్న ఆత్మానందాన్ని అనుభవిస్తున్నామా-విశ్లేషించుకోవలసి ఉంటుంది.





శ్రీరామమంత్రం ముమ్మారు జపించమన్నాడు శిష్యుడు ఒక భక్తునికి సలహా యిస్తూ. "ఓరి వెర్రినాయనా, మూడు సార్లెందుకురా, ఒక్కసారి చాలు-త్రికరణశుద్ధిగా పలకగలిగితే అదే తారకం" అన్నాడు గురువు. విష్ణు సహస్రనామంలోని ఒక్క నామమైనా భావయుక్తంగా పలికితే మేలు కలుగుతుందంటారు పెద్దలు. ఇవన్నీ చెప్పేది ఒక్కటే విషయం - పూజకైనా, పారాయణకైనా, మంత్రానికైనా భావన, ఏకాగ్రత అవసరం. ముఖ్యంగా పారాయణలో నేర్చిన మంచి విషయాలు ఆచరణలోకి తెచ్చుకోవటం అత్యవసరం. ముఖ్యంగా శ్రీ సాయిసచ్చరిత్ర పారాయణలో ప్రతి అంశమూ అమూల్యమే, అద్భుతమే. అందుకే అక్షరాక్షరమూ కంఠగతం, బుద్ధిగతం అయ్యేలాగా చదవటం అవసరం.

పరమపూజ్య గురుదేవులు హఠాత్తుగా చరిత్రలోని ఏదో ఒక మారుమూల వాక్యం చెప్పి "ఇది ఏ సందర్భంలో వస్తుంది?" అని అడిగే వారు. ఓసారి "అచ్చట ఒక బండిబాటయు, కాలిబాటయు కలవు-ఈ వాక్యం ఏ సందర్భంలో వస్తుంది?" అని అడిగారు. అందరూ నోళ్లు తెరిచారు. అది వీరభద్రప్ప-చెన్నబసప్ప కథలో వస్తుంది-అని అరవింద చెప్తే చాలా సంతోషించారు. ఒకవేళ వారి ప్రశ్నకు జవాబు రాకపోతే "వెదికి చెప్పండి" అనేవారు. మరోసారి సచ్చరిత్రపై విహంగవీక్షణం జరిగేది ఆ విధంగా.

ఒకసారి ఒక వైష్ణవ కుటుంబంతోపాటు రైల్లో ప్రయాణం చేయవలసి వచ్చింది. వారిలో ఒక మామ్మగారు తమ కుటుంబసభ్యుల మాటల్లో, ఆలోచనల్లో పొరపాట్లు సరిదిద్దవలసి వచ్చినప్పుడెల్లా "పెరుమాళ్ల వారలాగే సాయించారా? పెరియాళ్వారు ఇలా చెప్పలేదూ! పరాశర భట్టారకుల సంగతి మనకేం చెప్తోందిరా?" ఇలా దేనికైనా తమ దివ్యప్రబంధంనుంచో, జీవితగాథల నుంచో ఉదాహరణలిస్తూ వచ్చారు. అదుగో-నిత్య జీవనానికి మహాగ్రంథాలలోని విషయాలను అలా జతచేసుకోవడం వలన పారాయణ మనలోకి ఇంకిపోయి మనసు ధన్యులను చేస్తుంది - అలా ధన్యులమవుదాం.



# గురుసన్నిధికి అమ్మ



- రాంబాబు

పూజ్య గురుదేవుల విగ్రహావిష్కరణ పూర్తి అయిన తరువాత ఒకరోజు మాతాజీ నాతో (రాంబాబు) "ఒరే రాముడు నా పని పూర్తి అయ్యిందిరా, ఇక ఆశ్రమం మీరే చూసుకోవాలి!" అన్నారు. నేను "అదేం మాట అమ్మా! అలా అంటారు" అన్నాను. "అవునురా నాకు తెలుస్తుందిరా" అంటూ నాకు ఒక కల వచ్చింది-అంటూ చెప్పారు.

కలలో గురువుగారు కన్పించారు-"నేను సాయిబాబా విగ్రహం పట్టు కున్నాను. గురువుగారితో ఎవరో ఉన్నారు - ఏదో చెప్తున్నారు. గురువుగారు నావైపే చూస్తూ పిలుస్తూ ఉన్నారు. నా చేతిలో ఉన్న సాయిబాబా వారిని నీ చేతిలో పెట్టాలని నిన్ను పిలుస్తున్నాను - నీవేమో ఎక్కడో ఉన్నావు. నేను గట్టిగా ఎలుగెత్తి పిలిచాను - నీవు పరుగెత్తుకు వచ్చావు. బాబా వారిని నీకు అప్పగించి గురువుగారి దగ్గరకు వచ్చాను. వారు నాతో ఏదో జ్ఞానమార్గం గురించి చెప్తూ ఉన్నారు. ఇంతలో మెలకువ వచ్చింది-సమయం సరిగ్గా తెల్లవారుజాము గం.3.15 ని.లు అయ్యింది" అన్నారు. నాకు సూచన చేస్తున్నారు రాము. ఇక చాలు - అని ఎప్పడూ కలలో రాని గురువుగారు యిప్పడు వచ్చారు. "సాయివాణి మాసపత్రికకు కూడా యిక మీదట నువ్వే చూడాలని యీ ఒక్క నెల మాత్రమే నేను రాస్తాను" అన్నారు. నాకు భయంవేసింది. ఒక పత్రిక నడిపించటం అంటే అంత చిన్న విషయం కాదు గదా! అనిపించింది. మరోరోజు మరో కల వచ్చింది అని చెప్తూ ....

నేను మూడో అంతస్తులో ఉన్నాను. నా చుట్టూ విపరీతంగా జనం ఉన్నారు. నన్ను తోసేస్తున్నారు. నాకు ఊపిరి ఆడటం లేదు. క్రిందకు దిగలేక





పోతున్నాను. ఇక లాభం లేదని - పైనుండి క్రిందకు దూకేసాను. ఎవరో నన్ను పట్టుకొని నెమ్మదిగా క్రిందకు దింపారు. ఆ చేతులు గుర్తుపట్టాను-బాబాగారే అని. ఆ సమయం తెల్లవారుజామునే అని.

ఈ విషయాలే ట్రస్టు సభ్యులతో పంచుకున్నారు కూడా. అమ్మకు కొద్ది రోజులుగా జ్వరం రావటం, విపరీతమైన దగ్గు రావటం జరిగింది. కఫం కూడా బాగా రావటం ప్రారంభమయింది. డా॥ ప్రవీణ్‌కుమార్‌గారి సలహా మేరకు మందులు వేసుకోసాగారు. ఆగస్టు 12వ తేదీన జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులకు వ్రతకథ కూడా ఓపిక లేకనే చెప్పారు. వాళ్లను ఆశీర్వదించారు. ఆరోజు సాయంత్రం హోమియో డాక్టర్‌గారిని కలిసి మందులు కూడా తెచ్చుకున్నాము. ఆగస్టు 15వ తేదీన జయక్క, కవితక్క (మాతాజీ ఓల్డ్ స్టూడెంట్స్) వాళ్ళు కూడా వచ్చారు. అమ్మ నీరసంగా ఉండటం వల్ల స్కూల్ దాకా వచ్చి కూడా కార్లోనే ఉండి పోయారు. పిల్లల ప్రదర్శనలు, ఉపన్యాసాలు కొద్దిసేపు చూసి ఇంటికి తిరిగి వచ్చారు. అప్పటినుంచే మొదలు అమ్మ ఆరోగ్యం క్షీణించటం జరిగింది. యూరిన్‌తో బ్లడ్‌పోవటం జరిగింది. డా॥ ఝాన్సీలక్ష్మీగారు మాతాజీ ఆరోగ్యం గురించి ఆరాతీసి జాగ్రత్తలు చెప్పి మరీ వెళ్ళారు. భారతి, భువనేశ్వరీలను హాస్టల్స్‌కు పంపుతూ ఎన్నో జాగ్రత్తలు చెప్పారు మాతాజీ. మధ్యాహ్నం ఉపాధ్యాయ బృందాన్ని సమావేశపరచి- "నేను ఉన్నా లేకపోయినా మీరు సమిష్టిగా సమాజసేవలో తరించాలని, పిల్లలు క్రమశిక్షణ తప్పకుండా చూడాలని, ఉపాధ్యాయులే మార్గదర్శకులని నీతి-నిజాయితీ, ప్రవర్తన, ఆలోచన మన నుంచే పిల్లలు గ్రహిస్తారని చెప్పారు. నరేశ్, నరసింహ్మ మాస్టార్లకు బట్టలు పెట్టి మరీ ఆశీర్వదించారు. రాత్రి 12.15 ని.లకు మంజుల (ఆశ్రమవాసి) ఫోన్ చేసింది. అన్నయ్యా! మాతాజీ బాగా నీరసంగా ఉన్నారు. నీవు త్వరగా రా! నాకు భయంగా ఉంది అని, నేను లేచి వచ్చేలోపే గీతమ్మ నుంచి ఫోన్ అమ్మకు చెమటలు

పట్టాయనీ, విపరీతమైన నీరసంగా ఉన్నారు - వెంటనే హాస్పటల్‌కు తీసుకువెళదాము త్వరగా రా! అన్నయ్యా అని అన్నది. అమ్మ నన్ను చూస్తూనే రాముడు భయ పడకురా! రక్తం ఎక్కువగా పోతుంది. అందువలన నీరసంగా ఉంది. డా॥ ప్రవీణ్‌కుమార్‌కు ఫోన్ చేసాను రమ్మన్నారు” అన్నారు. నా కాళ్లు చేతులు ఆడటం లేదు. మనస్సు విపరీతమైన ఆందోళనతో నిండిపోయింది. గురుదేవుల పాదాలు పట్టుకొని ఏడ్చాను. అమ్మ కారులో కూర్చోగానే వాయు వేగంతో వెళ్తున్న నన్ను వీపు, తల నిమురుతూ భయపడకురా, చెమటలు తగ్గాయి, గీత సాయిరాం చెప్పమ్మా అంటూ తాను కూడా - గురుదేవా! గురుదేవా! సాయిరాం సాయిరాం అంటూ ఉన్నారు. ఇ.సి.ఐ.యల్.లో ఉన్న శ్రీ రాఘవేంద్ర హాస్పటల్‌కు వెళ్ళాము. 17 ని.లలో అమ్మకు ఐ.వి. ఫ్లూయిడ్ పెట్టి బ్లడ్‌టెస్టులు చేయించారు. అన్నీ బాగానే ఉన్నాయనీ, రక్తం పోవటం వలన బాగా నీరసించారని చెప్పారు. చాలాసేపు అమ్మ దగ్గరనే ఉన్నారు కూడా. తెల్లవారింది. విషయం తెలుసుకొని పరిగెత్తుకు వచ్చింది జయక్క-11 గం.ల విమానప్రయాణం రద్దు చేసుకొని మరీ నా మనస్సు టీచరుగారిని వదిలిపెట్టి వెళ్ళబుద్ధి కావటం లేదని. అమ్మను అలా చూడగానే ఏడ్చేసింది. అమ్మ కాళ్ళు నొక్కుతూ అమ్మను నిద్ర బుచ్చింది. ఆగస్టు 16న తమ మనమరాలికి అన్నప్రాసన మాతాజీ చేతులు మీదుగా చేయించుకోవాలని గుంటూరు నుండి బాబూ సుధాకర్, పద్మావతి గార్లు ఆగస్టు 15 సాయంత్రమే వచ్చారు. ఆ సాయంత్రమే ఆశ్రమానికి 2 సం॥ పూర్వం తాను వచ్చానని గురుదేవులను, మాతాజీని సందర్శించానని, తిరిగి వెళ్లేటప్పడు నాకు ఎన్నో అనుభూతులు కల్గినాయని అంటూ ప్రభు సుబ్రహ్మణ్యం అనే డాన్స్ మాష్టారు వచ్చారు. మాతాజీ ముందర ఆశ్రమ బాలబాలికలకు నృత్యం పరిచయం చేసారు. ఆగస్టు 16న ఆశ్రమభిక్ష ఉంది కదరా నీవు వెళ్లరా రాము నేను బాగానే ఉన్నాను కదా! అని అమ్మ చెప్పటం - నేను





మిమ్ములను వదలి వెళ్లలేనని గీతమ్మను ఆశ్రమానికి పంపించాను. చిరంజీవి డా॥ రాజేశ్, సృజన గార్ల కుమార్తె చిన్మయికి సాయి దేవాలయంలో ఆశ్రమ సభ్యుల మధ్య అన్నప్రాశన కార్యక్రమం జరిగింది. భోజనాలు పూర్తికాగానే మాకు భోజనాలు తీసుకుని గీత, ఆనందం మామయ్య, సుధాకర్‌గార్లు హాస్పటల్‌కు వచ్చారు. అమ్మను పలకరించారు. మా భోజనాలు అయిపోయేలోపే రాజేశ్, సృజన వారి అమ్మాయితో హాస్పటల్‌కు వచ్చి మాతాజీ ఆశీస్సులు పొందారు. ఇంతలోనే మాతాజీ బాత్‌రూమ్‌కి వెళ్ళి వస్తూనే క్రింద పడిపోయారు. స్పృహలో లేరు. హాస్పటల్‌లో ఉన్న అందరూ పరుగెత్తుకు వచ్చి మాతాజీని ఐ.సి.యు.లోకి తీసుకువెళ్లారు. ఈ వార్త తెలిసిన ట్రస్టు సభ్యులు రాంమోహనరావు- లలితగార్లు, రవీంద్రారెడ్డి-ఇందిరగార్లు, పద్మజక్క, కవితక్క, వాళ్ళందరూ పరుగెత్తుకు వచ్చారు. అరగంటలో స్పృహలోకి వచ్చారు మాతాజీ. డా॥ ప్రవీణ్ కుమార్‌గారు మమ్మల్నందరినీ తోడ్కొని వెళ్లి మాతాజీని చూపించి-మాకు ధైర్యం చెప్పారు. రాత్రంతా ఐ.సి.యు.లోనే ఉంది అమ్మ. ఈ వార్త తెలిసిన డా॥ ఝాన్సీలక్ష్మిగారు ప్రొద్దునే వెళ్లినా, సాయంత్రం గం.6.30ని.లకు రైలు పట్టుకొని రాత్రి గం.12.00లకు హాస్పటల్‌కు వస్తూనే అమ్మ దగ్గరకు వెళ్లారు. అమ్మ పరిస్థితి గురించి డాక్టర్స్‌ను అడిగి తెలుసుకున్నారు. హార్ట్, బీపి, పల్స్ నార్మల్‌గానే ఉన్నాయిగానీ, బ్లడ్ పోతుంది కాబట్టి హెచ్.బి. టెస్టు చేయించి ఒక నిర్ణయానికి వద్దామన్నారు. రాత్రంతా అమ్మ కాళ్ళు నొక్కుతూ జయక్క, ఝాన్సీగారు, గీత, నేను ఐ.సియు.లోనే ఉన్నాము. తెల్లవారుజామున బ్లడ్‌టెస్టులో హెచ్.బి. బాగా తగ్గిందనీ, వెంటనే ఒమెగా హాస్పిటల్‌కు షిఫ్ట్ చేద్దామని, అలా తగ్గటం మంచిది కాదనీ డా॥ ప్రవీణ్ కుమార్, ఝాన్సీ గార్లు చెప్పటంతో బంజారాహిల్స్‌లోని ఒమెగా హాస్పిటల్‌కు వెళ్ళాము. డా॥ మోహనవంశీగారి పరీక్ష అనంతరం ఎమ్.ఐ.సి.యు.లో అమ్మకు వైద్యం మొదలయింది. ఒకప్రక్క బ్లడ్ ఎక్కుతూనే ఉంది. మరోప్రక్క

కొంచెం కొంచెం పోతూనే ఉంది. బ్లాడర్ అంతా బ్లడ్‌క్లాట్ అయిందని సోడియం వాటర్‌తో క్లీన్ చేయటం ప్రారంభమయింది. మధ్యాహ్నం కొంచెం ఓపికగా కనిపించారు. చూడటానికి వచ్చిన భక్తులతో మాట్లాడారు. మరునాడు రాఖీపూర్ణిమ కావటంతో నన్ను ఆశ్రమానికి వెళ్ళమన్నారు. సాయినాథవ్రతం జరిగే సమయానికి అమ్మ ఫోన్ చేసి మరీ వ్రతకథలు విన్నారు. అలాగే సాయినాథ క్షేత్రంలో జరుగుతున్న పుష్కరోత్సవాలలో భాగంగా సామూహిక సాయినాథ వ్రతంలో పాల్గొన్న భక్తులనుద్దేశించి ఫోన్ ద్వారానే మైకులో వారిని ఆశీర్వదిస్తూ చి॥ సాయిరమణ, ఉమ, వారి కుమారుడు అయిన సాయిప్రభూజీ జన్మదిన శుభాశీస్సులు అందించారు. కార్యక్రమానికి తాను లేకపోయానని, అయినా గురుకార్యం చక్కగా నిర్వహించి గురుదేవుల ఆశీస్సు పొందమని ఆశ్రమ నిర్వాహకులకు చెప్పారు. ఆగస్టు 19న ఉదయమే ఫోన్ చేసాను డా॥ ఝూన్సీగార్కి. వారు మాతాజీతో మాట్లాడించారు. త్వరగా హాస్పిటల్‌కు రమ్మని చెప్పారు అమ్మ. పిల్లలందరినీ, పెద్దలందరినీ పేరుపేరునా అడిగారు. హాస్పిటల్‌కు బయలుదేరాను- దారిలో సాయివాణి మ్యాటర్ డి.టి.పి.కి ఇస్తూ మాతాజీకి ఫోన్ చేసాను. అమ్మ మాట్లాడుతూ నీకు ముందే చెప్పానుగా - ఇక నేను చూడనని నీకు ఏది సబబు అనిపిస్తే అది చేయరా! అటూ ఫోన్ పెట్టేసారు. ధనలక్ష్మీ అక్కకు సాయివాణి మ్యాటర్ యిచ్చి హాస్పిటల్‌కు వెళ్ళేలోపలే రెండు సార్లు ఫోన్ చేయించారు రామును త్వరగా రమ్మని. నేను హాస్పిటల్ చేరువలోకి వెళ్తూనే - నాన్న ఎక్కడ ఉన్నావు - అమ్మ నిన్ను త్వరగా రమ్మంటున్నారు అంటూ ఇందిరత్తయ్య ఫోన్ చేసారు. అప్పటికే అక్కడ సాయిభరత్, అంకిత్ మాతాజీతో మాట్లాడి నన్ను కలవటానికి ఉన్నారు. మాతాజీని ఎం.ఐ.సి.యు నుంచి ఐ.సి.యు.కు మార్చారని చెప్పారు. నా మనస్సులో భయాందోళన మొదలయింది. కాళ్ళూ చేతులు వణుకుతున్నాయి. సిస్టర్ జలజగారి సాయంతో ఐ.సి.యు.లోకి వెళ్ళాను. అమ్మ





నన్ను చూస్తూనే యింత ఆలస్యం ఎందుకురా! అంటూనే నా చేయి తీసుకుని ముద్దు పెట్టుకున్నారు. భుజం తట్టారు. నా కళ్ళలోకి సూటిగా చూస్తూ - "రాముడు ఏది జరిగినా స్థిరంగా ఉండు-ఏదైనా భగవదిచ్ఛ ప్రకారంగానే జరుగుతుంది. గురుకార్యంలో ఏమరపాటు ఉండకూడదు- సంయమనంతో, ఓర్పుతో, నిరహంకారంతో నీ బాధ్యత నీవు నిర్వర్తించు. నీ వెనుక గురుదేవుల కరుణాహస్తం ఉంటుంది నాయనా! భయపడకు" అన్నారు. కొద్దిగా మంచినీరు ఇమ్మన్నారు-గ్లాసుతో కొంచెం నీళ్ళు నోట్లో పోసాను. అమ్మ రెండు బుగ్గలు తడిమాను ఏడుస్తూ. అమ్మ నా తల నిమురుతూ ఏడవకూడదురా నువ్వు" అన్నారు. అమ్మ పాదాల మీద తల ఉంచి నమస్కరిస్తుండగా-సెక్యూరిటీ వారు వచ్చి బయటకు పంపించి వేసారు. ఇంతలో సుధాకర్ మామయ్య, రాజేశ్, రామమోహనరావుగారు, పద్మజక్క అందరూ వెయిటింగ్ రూములో ఉండగా బేబి పిన్ని (మాతాజీ పూర్వాశ్రమ చెల్లెలు) వచ్చారు మాతాజీ ఆరోగ్యం గురించి వాకబు చేసి బాధపడుతూనే వెళ్ళిపోయారు. రాత్రి గం.10.00లకు సుధాకర్ మామయ్య (అమ్మ పెద్దతమ్ముడు) వెళ్ళి అమ్మతో మాట్లాడివచ్చారు. గం.10.15 ని.లకు మజ్జిగ, ఎలక్ట్రాల్ ప్యాకెట్, వాటర్‌బాటిల్ పంపించాను. సాయంత్రం గం.7.00లకు సెక్యూరిటీ వారు వచ్చి మాతాజీగారు గురూజీ ఫొటో, బాబా ఫొటో, విభూతి తెమ్మన్నారు-అని తీసుకువెళ్ళారు. రాత్రి గం.7.00లకు మాతాజీకి బ్లీడింగ్ కావటానికి కారణం తెలుసుకోవటానికి ఒక టెస్టు కూడా చేసారు. అయితే బ్లాడర్ అంతా బ్లడ్ క్లాట్స్ ఉన్నాయని, అందుచేత ఏమి కనుక్కోలేకపోయామని తిరిగి ఉదయం మరల టెస్టు చేస్తామని చెప్పారు. రాత్రి గం.1.00లకు సెక్యూరిటీ వారు వచ్చి డా॥ ఝూన్సీగారిని పిలిచి లోపలకు తీసుకువెళ్ళారు. 10 ని.లలో తిరిగి వచ్చిన ఝూన్సీగారు అమ్మ బాగా యిబ్బంది పడుతున్నారు రామూ అంటూనే ఏడ్చేసారు. నాలో భయం, దుఃఖం ఒక్కసారిగా ఆవరించాయి. గుండె ఆగిపోయినట్టుగా

అయ్యింది. ఝూన్సీగారు భుజం మీద చెయ్యి వేయటంతో లేచాను. ఐ.సి.యు. బయటనే నిలబడ్డాను. లోపలికి పంపించారు సెక్యూరిటీ వారు. అమ్మకు ఆయాసం బాగా వస్తూంది - ఆక్సిజన్ సాయంతో ఉన్నారు. మనలను గమనించే స్థితిలో లేరు-నాలో దుఃఖం కట్టలు తెంచుకుంది. అమ్మ పాదాల మీద పడి ఏడుస్తుండగా డాక్టర్స్ వారించారు. బయటకు వచ్చేసాను. తెల్లవారుజామున గం.02.15 ని.లకు అమ్మ గురుదేవుల సన్నిధికి పయనమయినారు. ఆశ్రమమంతా శోకసముద్రంలో మునిగి పోయింది. ట్రస్ట్ సభ్యులు తెల్లవారుజామున గం.3.00 లకు ఆశ్రమం చేరిపోయినారు. అనాథ శిశుమందిరంలో ఉన్న పిల్లలను ఓదార్చుతూ ఉన్నారు. అందరికీ ఫోన్ ద్వారా సమాచారాన్ని అందరూ అందరికీ తెలియపరచటంలో మునిగిపోయారు. డాక్టర్ ప్రవీణ్ గార్కి విషయం తెలియటంతో షాక్ అయ్యారు. అంబులెన్స్, ఫ్రీజర్ పంపుతున్నానన్నారు- గద్గదస్వరంతో. అప్పటికీ హాస్పిటల్‌కు చేరిపోయారు. పద్మక్క, విజయభాస్కర్‌గార్లు, సురేంద్రరెడ్డి, పద్మజ, సుధాకర్ మామయ్య, రాజేశ్, నాని దంపతులు అందరినీ చూడగానే ఒక్కసారిగా నా కళ్ళు వర్షించాయి. హాస్పిటల్ వారి బిల్లు చెల్లించి ఆశ్రమం చేరేసరికి ఉదయం గం.5.45 ని.లు అయ్యింది. అప్పటికే ఆశ్రమానికి జనం రావటం ప్రారంభమయింది. శ్రీ నాయర్‌గారి చేతులలో వాలిపోయాను. ఏడుస్తూనే ఏర్పాట్లు చేస్తున్నారు హేమంత్‌రెడ్డి, ఆశ్రమ పిల్లలు, పెద్దలు. ఉదయం గం॥9.00ల కల్లా అన్ని గ్రామాలకు చేరిపోయింది విషయం. ప్రతి వారి కన్నుల నిండా నీరు, హృదయం అంతా బాధతో నిండిపోయింది. అమ్మతో పరిచయం ఉన్న మిత్రులు, భక్తులు, శిష్యులు, పూర్వవిద్యార్థులు అమ్మ ద్వారా మేలు పొందినవారు ఎందరో రాసాగారు. గం.4.00లకే విషయం తెలుసుకొని వచ్చిన పూజ్యశ్రీ మాతా నిర్మలయోగ భారతి మాతాజీ నన్ను, ఆశ్రమం వారిని ఓదార్చారు. ఆనందం మామయ్యగారిని ఓదార్చారు. వారు





"మాతాజీ గొప్ప సేవకురాలు, సరస్వతీ పుత్రిక, మన అందరికీ తల్లి అని సాయివాణీ చదువుతూ ఉంటే కళ్ళ ముందు ఆ దృశ్యాలు కదిలేవిధంగా రాయటం ఆమె గొప్పదనమని గురువుగార్కి సరైన శిష్యురాలనీ తానే చెప్పేవారో అదే ఆచరించేవారనీ, ఎంతో త్యాగం చేసి యీ ఆశ్రమం యింతగా అభివృద్ధి చేసింది అంటే అది మాతాజీగారి సమర్థతతోనే జరిగింది'' అని భక్తులకు తెలియజేసారు. మాతాజీతో వచ్చిన లక్ష్మీనారాయణ తాతయ్య (మాతాజీకి అన్నయ్య వరుస) మాట్లాడుతూ "గురువుగారు శుద్ధ సాత్వికులు, మాతాజీ రజోగుణం, జ్ఞానంతో మేళవించి ఆశ్రమం సమర్థ వంతంగా నడిపించారు. ఆవిడ ఎంతో గొప్పవారని నేను ప్రత్యేకంగా మీకు తెలియజేయవలసిన పని లేదని" చెప్పారు. నాయర్‌గారు వచ్చిన వారికి టీ-టిఫిన్స్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసారు. నాయర్‌గారు ఏడుస్తూ- "నాయర్‌జీ భోజనం చేయండి" అనే అమ్మ మరి యికలేరని భోరున ఏడ్చారు. అమ్మ పార్థివదేహం ఉష భవనంలో అమ్మ ఎప్పుడూ కూర్చునే హాలులోనే ఉంచాము. ధర్మారెడ్డిగూడెం నుండి వచ్చిన చంద్రారెడ్డిగారు "రామూ మన పెద్ద దిక్కు రాలిపోయింది" అని విలపించారు. ముందు రోజే వెళ్ళిన జయక్క విశాఖపట్టణం నుండి పరుగెత్తుకు వచ్చింది. టీచర్ గారూ! మీకు ఇది న్యాయమా! అంటూ అమ్మ మీద వాలిపోయారు. మాతాజీగారితో కలిసి పనిచేసిన రేవతిరాణి టీచర్, వరలక్ష్మిగారు, విజయగారు తదితరులు మాతాజీ గారితో పోట్లాడుతూ బావురుమన్నారు. విజయవాడ నుండి దేవకీదేవిగారు, దశ్వంతరావుగార్లు వచ్చారు. అమ్మను చూస్తూనే వాణీగారు మీరు మా ఇంటికి వస్తామన్నారు. మీకు చీర పెట్టాలని అనుకున్నాను. ఇంతలో మీరు యిలా అంటూ దుఃఖపడ్డారు. ప్రతివారూ మాతాజీగారితో పరిచయాన్ని తలచుకుంటూ కుమిలిపోయారు. రేపల్లె నుండి కోటేశ్వరరావు మామయ్య (సాయినాథ క్షేత్రం నిర్వాహకులు) సాయిరమణ, ఉమా వాళ్లు వచ్చి అక్కా!

అంటూ ఘోల్లుమన్నారు. తెనాలి నుండి గోపీకృష్ణ, హరికృష్ణలు హాస్టల్‌లో ఉన్న భువనేశ్వరినీ, భారతీని తీసుకువచ్చారు. వారిని చూడటంతో నా దుఃఖం ఉప్పొంగింది. మీ అమ్మ లేదు పిల్లలూ అంటూ నేను, అమ్మా అంటూ వారు భోరున ఏడ్చారు. ట్రస్టు సభ్యులందరినీ సమావేశపరచిన పిదప శ్రీ మాతా నిర్మలయోగ భారతిగారు మాతాజీ ఏ విధంగానయితే సమాజానికి ఉపయోగపడిందో, ఆ దేహానికి కూడా అగ్నిసంస్కారం అంత చక్కగా జరగాలనీ, ఆ అంత్యేష్టి నేను దగ్గర ఉండి జరిపిస్తాననీ, ఆ భారం తాను ఎత్తుకున్నారు. ఏమీ తెలియని నాకు దన్నుగా నిలబడ్డారు. ట్రస్టు సభ్యులందరూ ఆమోదం తెలిపారు.

20వ తేదీ రాత్రి పెద్దపర్వతాపురం గ్రామస్తులు, వచ్చిన భక్తులు ఆలపించిన భజనలు, సంకీర్తనలతో, సాయినామంతో ఆశ్రమమంతా నిండిపోయింది. సాయిచాలీసా పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణ, భగవద్గీత పారాయణ, అమ్మ చివరిసారిగా హాస్పిటల్‌లో పాడిన పద్యం మైకులో వినిపించగా అందరూ గొల్లున విలపించారు. 21వ తేదీ ఉదయం కృష్ణా-గోదావరి అనేక నదుల సంగమమైన ప్రదేశాల నుండి తెచ్చిన జలాలతో స్నానం చేయించారు. విభూతి, పంచామృతంతో అభిషేకించారు. నూతన వస్త్రాలు కట్టారు. అమ్మకు ఆశ్రమం అంతటా తిప్పి చూపించారు. ఆశ్రమం ఉత్తరభాగాన స్థలంలో నేలంతా శుభ్రం చేసి గోమయంతో అలికి ముగ్గులు వేసిన ప్రదేశంలో యజ్ఞం కోసం ఉపయోగించే కర్ర మాత్రమే వాడిన చితి దగ్గర అమ్మను ఉంచారు. వట్టివ్రేళ్ళ పానుపు వేసారు. సుగంధ ద్రవ్యాలు పేర్చారు. అమ్మను దాని మీద పడుకోబెట్టారు. నాకు దుఃఖం ఆగటం లేదు. ప్రక్కనున్నవారు ఓదార్చే ప్రయత్నం చేస్తున్నారు. 9 సం.రాల ప్రాయంలో అడుగుపెట్టిన నాకు తోడూనీడై నిలచిన అమ్మ, విద్యాబుద్ధులు నేర్పిన అమ్మ, గురుమార్గంలో నడిపించిన అమ్మ, తప్పులు ఒప్పులు సరిదిద్దిన గురువు, నాలో





ఆధ్యాత్మికతను వికసింపజేసిన దైవం, నా సర్వస్వం నాకు మళ్ళీ కనపడరు-నా కాళ్ళు వణుకుతున్నాయి. నా కళ్ళు నీళ్ళతో నిండి మసకబారినాయి. ఎవ్వరూ కనిపించనంత. అందరూ అమ్మను కడసారి చూచి నమస్కరించి - ఎండుకొబ్బరిచిప్పలో ఉంచిన కర్పూరం చుట్టూ ఉంచి నమస్కరించారు. 50 కేజీల ఆవునెయ్యి, సుగంధ ద్రవ్యాలతో, గంధపు చెక్కలతో అమ్మను కప్పివేసారు. మాతా నిర్మలయోగ భారతి మాతాజీవారి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో స్వహాకారాలతో అమ్మ పార్థివదేహాన్ని అగ్నికి సమర్పించాము. మాతా నిర్మలయోగ భారతిగారు అమ్మ యొక్క గొప్పతనం, త్యాగనిరతి, గురువు పట్ల అమ్మ చూపించిన భక్తి, ఆశ్రమానికి చేసిన సేవ మొదలైన విషయాలు గద్గదస్వరంతో తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో ఆశ్రమానికి ఎంతో సహకరించి కార్యక్రమాన్ని తమ భుజస్కంధాల మీద వేసుకున్న పెద్దలకు, పిన్నలకు అందరికీ కృతజ్ఞతలు. మరునాడు అమ్మ అస్తికలు సంచయనం చేసిన తరువాత చి॥ హేమంతరెడ్డి వాహనములో బయలుదేరి అమ్మ పుట్టిన ఊరు అయిన రేపల్లె సాయినాథ క్షేత్రంలో ఉన్న కృష్ణానదిలో అమ్మ అస్తికలు నిమజ్జనం చేశాము. అమ్మ 18న పుష్కర స్నానం చేసి, 22న సత్తెనపల్లిలోని సాయి దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొంటారని భక్తులకు చెప్పారు. ఆ విధంగానే చేయించారు. ఆవిడ సంకల్పశక్తి అంత గొప్పది, వాక్‌శుద్ధి కల్గిన తల్లి. అమ్మ గురించి ఎంత మాట్లాడినా తక్కువే. సాయివాణి పాఠకులారా! మీకు ఏమని చెప్పను. ఈ వార్తను మీకు ఏ విధంగా తెలియజేయగలను అనే బాధను భరిస్తూనే వ్రాసాను. అమ్మను గురించి ఎంత రాసినా తక్కువే. సెలవా మరి!

**(అమ్మా! నీ గురించి తెలియజేసే విషయంలో మాటల అమరికలో, భావ ప్రకటనలో తప్పలుంటే మన్నించగలవు - నీ రాముడు)**

# జగద్గురు తత్త్వబోధక స్వామి

- రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ ఫాదరీ చరిత్ర

- శ్రీ దిగవల్లి శివరావుగారి కథలు-గాథలు నుండి

(గత సంచిక తరువాయి)

## భూతవైద్యం

నోబిలీగారున్నూ, ఆయన శిష్యులున్నూ ఏసుక్రీస్తు శిలువను రక్షరేకుగాను, క్రైస్తవ పూజలోని పవిత్రోదకాన్ని మంత్రతీర్థంగానూ ఉపయోగించి జబ్బుపడిన వారికి భూతవైద్యం చేసి కుదిర్చే తంత్రం ఒకటి ప్రారంభించారు. 1607లో ఒక ఆడమనిషికిన్నీ, 1608లో ఒక మహమ్మదీయునికిన్నీ ఇలాగ దయ్యం వదలిపోయిందనిన్నీ, పోతూ ఉన్న భూతము నోబిలీగారి ప్రభావాన్ని ఉగ్గడించినదనిన్నీ ఫాదరీల ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయబడియున్నది. ఒకమాటు యీ నోబిలీ యేలాంటివాడని ఒక దయ్యాన్ని ఆయన శిష్యుడు అడుగగా అతడు చాలా శక్తులు గలవాడనిన్నీ, ఆయన బోధించే ధర్మాలన్నీ నిజమైనవనిన్నీ దయ్యం చెప్పినదట. ఈయన తలపెట్టిన కార్యానికి మొదట విఘ్నాలు కలుగుతాయనిన్నీ దయ్యం చెప్పినదట. ఈయన తలపెట్టిన కార్యానికి మొదట విఘ్నాలు కలుగుతాయనిన్ని, మూడేళ్లలో జయం కలుగుతుందనిన్నీ కూడా చెప్పిందట. ఇలాగ భూతవైద్య తంత్రాలు జరపడం వల్ల మధురానగరంలో ప్రజలలో నమ్మకం కుదిరి నోబిలీ గారి ప్రభావాన్ని గురించి విపరీతంగా చెప్పకోవడం ప్రారంభించారు. మధుర రాజసభలోకి కూడా ఆయన ఖ్యాతి ప్రాకింది. అనేకులైన ప్రభువులు ఆయనతో స్నేహం చెయ్యడం ప్రారంభించారు.

## ఫలితాలు

ఇలాగ వేషధారణ చేసి కపటనాటక మార్గం ద్వారా ఏసుక్రీస్తు సేవ





చేసే పద్ధతి త్వరలోనే ఫలప్రదమైనది. ఈ నోబిలీ తన జీవిత విధానం వల్ల గర్విష్ఠులైన బ్రాహ్మణుల హృదయాలలో సంచలనం పుట్టించి వారిని ఆకర్షించాడు. అందువల్ల వారీయనను చూడడానికి రావడం మాత్రమే గాక భగవంతుణ్ణి గురించి ఆయన చెప్పే సంగతులను శ్రద్ధతో వినడము కూడా ప్రారంభమైంది. అంతేకాదు. అందులో కొందరు భూమి మీద ప్రణమిల్లి ఆయన పాదధూళిని శిరస్సున ధరించేవారు. ఇంత బాగా తత్వబోధ చెయ్యగలవాడింకొకడు లేడని వేనోళ్ల పొగిడేవారు!"

నోబిలీ వేసిన పథకం పారడానికి దారి ఏర్పడింది. అంతట అతడు హిందువులను బహిరంగంగా క్రైస్తవ మతంలో కలపడానికి ప్రయత్నించాడు. ఒక హిందూ మత గురువుతో నోబిలీ ఇరవై రోజులు-రోజు కైదారు గంటల చొప్పన శాస్త్ర చర్చ చేసి, వాదించి ఆఖరుకు తన సిద్ధాంతాలను స్థాపించినట్లు జయభేరి వేయించి ఆ గురువును క్రైస్తవ మతంలో కలిపాడట. తనకు తెలుగు, సంస్కృతములు నేర్పిన బ్రాహ్మణ గురువును కూడా మతంలో కలిపాడు, అంతట ఒకరి తరువాత ఒకరిని చాలామందిని మతంలో కలపగలిగారు. బ్రాహ్మణులు, రాజులు, రాజోద్యోగులు, శాస్త్రజ్ఞులు, నాయకులు, గొప్ప కులాల వారు, సంపన్నులు అతని దగ్గరకు వచ్చి తరణోపాయం చెప్పమని వేడుకొనేవారు. దేశంలో చాలా గొప్పవాడని ప్రఖ్యాతి చెంది విజయనగర చక్రవర్తుల ఉద్యోగాలలో పెద్దయైన దుంబిచ్చి నాయకుడు కూడా యీయనకు శిష్యుడు కావాలని కుతూహలపడ్డాడుగాని రాజుగారికి కోపం వస్తుందని ఊరుకున్నాడు.

క్రైస్తవమతం అతి త్వరగా వ్యాపించింది. హిందూ మతం కొద్దిరోజులలో నశిస్తుందా అని చాలామందికి తోచింది. దేశమంతా గగ్గోలుపుట్టింది. నోబిలీ చేసిన ప్రచారం వల్ల బ్రాహ్మణ పురోహితుల ఆదాయం పూర్తిగా

తగ్గిపోయింది. వ్రతాలు, పూజలు చేసేవారిచ్చే దక్షిణలు తగ్గిపోయినవి. హిందూ స్వాముల వారికి ముడుపులు కూడా తగ్గిపోయినవి. అందువల్ల సనాతన ధర్మపరులందరూ కళ్లు తెరిచారు. నోబిలీ కట్టిన క్రైస్తవ దేవాలయము స్థలం తనదని మధుర దేవాలయం ప్రధాన అర్చకుడు తగాదా పెట్టినాడు. అంతట ఈ నోబిలీగారి క్రైస్తవ ప్రచారానికి వ్యతిరేక ప్రచారం ప్రారంభమైనది. హెర్మైకత్తియనే శ్రీమంతుడొకడు నోబిలీగారికి సహాయపడినందువల్ల అప్పటికి నోబిలీగారి క్రైస్తవ దేవాలయానికి ఆపద తప్పింది. ఈ హెర్మైకత్తి క్రైస్తవ మతంలో కలియకపోయినా నోబిలీగారికి ప్రాపకుడుగా వుండేవాడు. ఇంతలో నోబిలీగారికి ఇంకొక తవ్వాయి వచ్చింది. దానివల్ల ఆయన మతప్రచారం కట్టిపెట్టవలసి వచ్చింది.

## ఆశ్వాసాంతం

ఇదివరలో మధురానగరంలో క్రైస్తవ మత ప్రచారకుడుగా ఉన్న ఫెర్నాండెజ్‌గారికి యీ నోబిలీగారు అవలంబించే ప్రచారపద్ధతులు, చర్యలు క్రైస్తవ ధర్మాలకు విరుద్ధంగా ఉన్నట్లు తోచింది. నోబిలీగారి కొన్ని చర్యలు చాలా అసహ్యకరంగా తోచి మందలించాడు గాని లాభం లేకపోయింది. అంతట అతడు పై యధికారులకు యీ చర్యలన్నీ వివరించి చెప్పడం వల్ల నోబిలీగారి ప్రవర్తన బాగాలేదని పై యధికారులన్నారు. గోవా నగరంలో ఉన్న పోర్చుగీసు క్రైస్తవ మతాధికారులకు నోబిలీ మీద ఈర్ష్యాభావము కూడా కలిగింది. క్రైస్తవ మతంలో కలిసిన హిందువులు తమ పూర్వపు మతాచారాలన్నీ అవలంబించవచ్చునని నోబిలీగారు అనుజ్ఞ యిచ్చినందు వల్ల క్రైస్తవమతం దురాచారాలకు పుట్టినిల్లుగా మారినదనీ యీ మతాన్ని గురించి ప్రపంచంలో చాలా అపఖ్యాతి కలిగినదనిన్ని వారన్నారు. (1) ముఖ్యంగా నోబిలీగారు హిందూ స్వాముల వారిలాగా 'జగద్గురువు' అనే





బిరుదును తాల్చడము, (2) తాను ఫరంగిని కానని చెప్పి నటించడము, (3) హిందువుల మూఢవిశ్వాసములను సూచించే పరిభాషను, వేదాంత సూత్రములను, మాటలను ఉపయోగించడము, (4) తన మాటలు విశ్వసించి క్రైస్తవ మతంలో కలిసిన హిందువులను వారు పూర్వాచారం ప్రకారం ఉంచుకునే జుట్టు పిలకలను ఉంచుకొననివ్వడము, జందెములు ఉంచుకోనివ్వడము, ముఖము మీద గంధాక్షతలు మొదలైన బొట్లు పెట్టుకోనివ్వడము, అనేక సందర్భాలలో స్నానాలు చెయ్యనివ్వడము, ఇంకా హిందూ వర్ణాశ్రమ ధర్మాలయందు అనాది నుంచీ జరుగుతూ వస్తూ ఉన్న ఆచారాలను అవలంబించనివ్వడము - ఇవి క్రైస్తవ మత ధర్మాలకు విరుద్ధమని వారు నిందించారు.

(సశేషం)

## శ్లోకవాణి

– శుకవాణి

"అనిత్యాని శరీరాణి, విభవో నైవ శాశ్వతః ।
నిత్యం సన్నిహితో మృత్యుః, కర్తవ్యో ధర్మ సంగ్రహః ॥"

లాటూరు (మహారాష్ట్ర)లో భూకంపం వచ్చిందని తెలిసి ఆశ్రమం నుండీ మిత్రులు పి.ఎల్.ఎన్. శాస్త్రిగారితో (ఎడ్వొకేట్) సహా వెళ్లాము. ఎటు చూచినా రాళ్లగుట్టలు, విరిగిపడిన చెట్లు, కూలిన భవనాలు, ఆ శిథిలాల క్రింద శవాల కోసం వెదికే చేతులు, పరిదీనమైన ముఖాలతో శూన్యంలోకి చూచే కళ్లతో వృద్ధులు, తమకు జరిగిన అన్యాయం తెలుసుకోలేని వయస్సుల్లో ఉండటం చేత ఎవరో దాతలు పెట్టిన రొట్టెలు తినేసి, హాయిగా తమ వాళ్లు స్థాపితమైన రాళ్ల గుట్టల మీదికి ఎక్కుతూ దుముకుతూ ఆడుకొనే పిల్లలు, దొరికిన శవాలపైబడి ఏడ్చే పెద్దల హృదయ విదారకమైన కంఠాలు .....

రాత్రి పుట్టినరోజు ఉత్సవం, పార్టీ చేసుకొని పడుకొన్నవారు, తెల్లవారి ప్రమోషన్ వస్తుందన్న సంబరంతో హాయిగా కబుర్లు చెప్పకొని పడుకొన్నవారు, హనీమూన్ నుంచి వచ్చి అలసిపోయి నిద్రపోయిన వారు వ్యాపారంలో ప్రక్కవాడిని ముంచి అరకోటి రూపాయలు ఆరగించినవారు, రేపటికి తిండి ఎలాగరా భగవంతుడా! అన్న ఆవేదనతో నిద్రపోయిన వారు, సినిమాల్లో వేషం యిస్తామన్నారని బొంబాయి వెళ్లడానికి పెట్టె సర్దుకున్న వారు, హాయిగా బొజ్జనిండా పాలు తాగి తల్లి గుండెల్లోకి ఒదిగి పడుకున్న పసిబిడ్డలూ ..... ఎవ్వర్నీ వదలలేదు మృత్యుదేవత. ధనం, సౌందర్యం, వయస్సు, స్థాయి, విద్య - ఏదీ అడ్డు రాలేదు. అందుకే స్మశానాన్ని సరిభూమి అనీ, యముడిని సమవర్తి అనీ అంటారు.

'ఈ లోకంలో ఏదీ శాశ్వతంగా ఉండదనీ, ఎవ్వరూ ఉండరనీ అందరికీ తెలుసు. కానీ, ఎవరికివారు తాము శాశ్వతమన్నట్లు ఏవేవో ఆరాటాలకు లోనవుతారు. అదే అన్నిటికన్నా విచిత్రం" అంటాడు చివరి యక్షప్రశ్నకు జవాబుగా ధర్మరాజు. అందుకే మనకు హితవు పలుకుతోంది శాస్త్రం - ఏమని?

"ఎంతో ప్రేమించి, పోషించి, అలంకరించిన యీ దేహాలుగానీ, ఎంతో ఆరాటపడి, శ్రమించి (యితరులను వంచించి కూడా) ఆర్జించి దాచిన సంపదలుగానీ నిలిచి ఉండేవి కావు. క్షణక్షణమూ మృత్యువు అతి సన్నిహితంగా తరుముతూనే ఉంటుంది. అందుచేత నాయనా! యీ తనూభ్రాంతి, ధనలాలస, తదితరమైన మోహాలన్నీ విడువు. నీతో చివరి వరకూ, అటుపైనా కూడా వచ్చేది నీవు చేసిన ధర్మ కార్యఫలం ఒక్కటే. తనువును లోక సేవ కోసం, ధనాన్ని దానాదికాల కోసం ఉపయోగించి ధన్యుడివి కావయ్యా!" అని బోధిస్తున్నది శాస్త్రం.





# లేఖావాణి

## గురుదేవులు సజీవమూర్తి

మాతాజీ,

మనసులో ఎంతో ఉంది. మాటల్లో చెప్పలేకపోతున్నా. చదవడంలో రుచి ఉండదని తెలిసి కూడా నాలుగు మాటలు వ్రాస్తున్నాను. క్షమించండి.

ప్రభుజీ వారి విగ్రహంలో జీవం నింపారు. అంతకుమించి కార్యక్రమం అద్భుతంగా చేశారు. చాలా చాలా సంతోషంగా ఉంది. అంతా సాయిధామమే స్వర్గంగా మీరు చేస్తున్న యిన్ని రకాల సేవలను - ఏమని వ్రాయగలను! పరుల మెప్పున కాశించక, నిస్వార్థంగా చేసే మీ చేతలు మీ మనసులకు జీవితాంతం ఉత్సాహాన్ని, ఆనందాన్ని, తృప్తిని యిస్తాయి. ఇది నిజమని మాత్రం వ్రాయగలను.

ఈ జన్మకు మీరు తీసుకున్న యీ దారి మీ జీవితాలకు బంగారు బాటలు వేయటమేగాక, మరుజన్మలకు పునాదులు వేస్తుంది. మీరు ధన్యజీవులు. మనిషి మరణించాక కూడా చిరంజీవిగా జీవించడమంటే శ్రీ ప్రభుజీ గారే మనకు ఆదర్శప్రాయులు. సాయిధామము మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను.

సర్వేజనా స్సుఖినో భవంతు !!

మీ,

చలసాని వెంకటేశ్వరరావు,

విజయవాడ



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

27-12-1911నాటి డైరీలో మిస్టర్ నటేకర్ (హంస, స్వామి అని కూడా పిలవబడతాడు). చిన్నగా, తెల్లగా చురుకైన ముఖకవళికలతో, కమ్మని గొంతుతోనూ, అలాగే వరంలాటి వ్యర్థపు మాటల జోరుతో ఉన్నాడు. అతడు కపర్దే కుటుంబీకు లను తన వృత్తిపరమైన పవిత్ర వేషంతోనూ, కథలతోనూ తన యాత్రలు హిమాలయాల, మానససరోవరం పర్యటన మొదలైన విషయాలతోను ఎంతో మెప్పించాడు. కపర్దే విదేశాల్లో ఉన్నప్పుడు కూడా ఇతను ఒక నెలరోజుల పాటు ఆ ఇంటివారి ఆతిథ్యాన్ని అనుభవించాడు. 1913 ప్రాంతాల్లో ఇంట్లోని ఒక తాళం వేసిన చెక్కపెట్టె నుండి 9 డైరీలు పోయినట్టు తెలుసుకున్నారు. కానీ, ప్రభుత్వానికి వాటిలో కపర్దేను నేరస్తుని చేయగల విషయాలేమీ దొరకలేదు. అందుచేత వారవి తిరిగి పంపించారు. ఈ సంఘటన తర్వాత చాలా కాలానికి హంస అనేవాడు కపర్దేల ఇంట్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సి.ఐ.డి. డిటెక్టివ్ అని, దాదాసాహెబ్ షిరిడీ వెళ్లినప్పుడు హంస ఆయన వెంట వెళ్లటం కూడా అక్కడ ఆయన కార్యక్రమాల సమాచారం రాబట్టడానికేనని తెలిసింది. 14 జూన్, 1913నాటి డైరీలో దాదాసాహెబ్ "హంస సాధువు కావడమనేది ఒక సాకు మాత్రమే అనిపిస్తుంది" అని వ్రాశారు. పైన ఊదీ గురించి గవర్నర్‌ని త్రిశూలంతో ఎదుర్కోవడం గురించి 29-06-1913 డైరీలో ఉన్న విషయాలు ఏ ప్రత్యేకతా లేనివి కావు. అప్పుడు హంస షిరిడీలోనే ఉన్నాడు. అతని (హంస) కుట్రలన్నీ సాయి బాబాకు తప్పక తెలిసే ఉంటాయి.





తన శక్తిని ఉపయోగించి ఆయన ఆ ప్రమాదం నుంచి తనను విశ్వాసపాత్రుడైన భక్తుణ్ణి రక్షించుకున్నాడు. ఈ సమయంలోని డైరీ 24, 25 లలో సాయిలీలలో ప్రచురించబడింది. కానీ ఆ భాగాలు అసంపూర్తిగా ఉన్నాయి. అవి యిలా ఉన్నాయి -

08-12-1911 - మాధవరావు దేశ్‌పాండే యిక్కడే ఉన్నాడు. నిద్రపోయాడు. నేను స్వయంగా నా కళ్లారా చూచాను, చెవులారా విన్నాను. ఇలా జరుగుతుందని విన్నాను గానీ - నా అనుభవంలోకి రాలేదు. ప్రతి ఉచ్ఛ్వాసలోనూ, నిశ్వాసలోనూ "సాయినాథ మహరాజ్, సాయినాథ్ బాబా" అని విన్పిస్తోంది. ఈ మాటలు ఎంత స్పష్టంగా ఉన్నాయంటే - ఆయన గురుకపెడుతున్నపుడు దూరం నుంచీ కూడా వినిపిస్తున్నాయి. ఇది నిజంగా అత్యద్భుతం.

12 మార్చి నుండి 15 మార్చి 1912 వరకు -

మేము పంచదశి చదవటం పూర్తి చేసాము. అంచేత ఈ సందర్భంలో రెండు దానిమ్మ పళ్లతో ఉత్సవం చేసుకున్నాం. బాబాపాలేకర్ అమరావతి నుండి వచ్చి, మా కుటుంబ సభ్యులంతా మహాచెడ్డ సంకట పరిస్థితులలో ఉన్నారని చెప్పాడు.

బాబా పాలేకర్ సాయిబాబా దగ్గరకు వెళ్లి నన్ను రేపుగానీ, ఎల్లుండిగానీ తీసుకువెళ్లడానికి అనుమతి సంపాదించాడు.

14, 15 మార్చి, 1912 నాటి విషయాలు సాయిలీలలో వెయ్యకుండా తొలగించబడ్డాయి.

14 మార్చి 1912 - "బాబా పాలేకర్ నాకంటె ముందు వెళ్లి నన్ను తీసుకు వెళ్లడానికి అనుమతి సంపాదించాడు".

15 మార్చి :

నేను, బాబా పాలేకర్, దీక్షిత్ మసీదుకు వెళ్లారు. దీక్షిత్ నేను అమరావతికి తిరిగి వెళ్లే విషయం ప్రస్తావించాడు. సాయిబాబా అనుమతి ఇచ్చారు. నేను తిరిగి వచ్చి, మా ఆవిడతో సామాను సర్దమని చెప్పారు. ఆవిడ భీష్మతో, బంధుతో

యిక్కడే ఉంటుంది. మధ్యాహ్నభోజనం తరువాత నేను, పాలేకర్ సాయిబాబాను చూడటానికి వెళ్లాము. గ్రామద్వారం దగ్గర ఆయనను కలుసుకున్నాము. కానీ, ఆయన ఆజ్ఞ మీద వెనక్కు వెళ్లాము. కొంచెం విభూతి తెచ్చి బాబా వారి చేతుల మీదుగా తీసుకున్నాము. ఆయన మమ్మల్ని "అల్లా భలా కరే"గా అని ఆశీర్వదించి, వెంటనే బయలుదేరమన్నారు. మేము 7 గంటల రైలెక్కి మన్మాడ్ చేరుకున్నాము. ప్రక్క ప్లాట్‌ఫారం మీదనే పాసింజర్ బండి ఉంది. వెంటనే ఎక్కి, పాలేకర్‌ని టిక్కెట్లకు పంపాను. సరిగ్గా అప్పుడే రైలు కదిలింది. పాలేకర్‌కు రైలు తప్పిపోయింది. నా పెట్టెలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టరున్నాడు. అతనికి జరిగినదంతా చెప్పాను. ఆయన నన్ను భూస్వాల్ దాకా వెళ్లి, అక్కడ పాలేకర్ కోసం వేచి ఉండమని సలహా యిచ్చాడు. నేను అలాగే చేసాను. నా దగ్గర డబ్బు లేదు-టిక్కెట్టూ లేదు".

పాలేకర్ భూస్వాల్‌లో కపర్డేను కలిసాడు. ఇద్దరూ కలిసి నాగపూర్ వైపు బండి ఎక్కి అమరావతికి మార్చి 16న చేరుకున్నారు. కపర్డే తన హృదయం షిరిడీలోనే వదిలేసి వెళ్లారు. 18 మార్చి 1912 డైరీలో ఆ మాట కన్పిస్తుంది.

"షిరిడీలో ఉన్న ఆధ్యాత్మిక వాతావరణం యిక్కడ లేదు. నేను చాలా లోటుగా ఫీలవుతున్నాను. షిరిడీలోలాగా ప్రొద్దున్నే లేవాలని అనుకున్నా లేవలేకపోతున్నాను". ఉదయస్తోత్రాలు చదవడానికే తెగకష్టపడుతున్నాను.

**(సశేషం)**

## సంస్మరణ సభ

**ప్రియ భక్తులారా! సాయివాణి పాఠకులారా!**

**శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు నిర్వాహకులైన, సాయివాణి ప్రధాన సంపాదకులైన శ్రీ మాతా శుకవాణి (మాతాజీ)గారి సంస్మరణ సభ సాయిధామంలో సెప్టెంబరు 4వ తేదీన జరుగుతుంది.**

**ఫోన్ నెం: 9848133565, 9440413455**





# సాకోరీ మహర్షి

## 3వ అధ్యాయం

మూలం : దాసుగణు

అనుకరణ : శుకవాణి

(గత సంచిక తరువాయి)

### వివాహం-గృహ త్యాగం

బాల్యం, బ్రహ్మచర్యం, ఆనందం ఇతరులతో పంచుకోవడంగానీ, గొప్పగా అధ్యయనాదులు చేయడంగానీ లేకుండానే గడిచిపోయింది కాశీనాథుకు. కనీసం గృహస్థాశ్రమమైన ఫలవంతమవుతుందా! చాలా మంది నిరుత్సాహంగా ఉండే కుర్రవాళ్లకు ఒక స్త్రీ యొక్క ప్రేమ గొప్ప ప్రభావితుడిని చేస్తుంది. ఆ వైవాహిక బంధంలోని మాధుర్యం అతని జీవితాన్ని మార్చేసి మరుభూమిలాంటి జీవితాన్ని స్వర్గతుల్యంగా మారుస్తుంది. ఇదంతా ఎప్పుడు అతడికి నచ్చిన స్త్రీ దొరికితేనే. కానీ, కాశీనాథుని అదృష్టం వేరుగా ఉంది. పెద్ద కుటుంబం. రెండు తరాల పెద్దలతో నిండిన ఉమ్మడి కుటుంబం. 14 ఏళ్ల కాశీనాథ్‌కు కోరుకోవడానికికానీ, కాదనడానికి కానీ అవకాశం లేదు. అతను వివాహితుడు కావాలని పెద్దలు నిశ్చయించారు. అతడు తనకే జీవనోపాధి లేదని, వివాహం పేరు మీద తన కుటుంబానికి మరో వ్యక్తి పోషణభారం అంటగట్టలేననీ, అది న్యాయం కాదని ఎంతో వాదించాడు. కానీ, అతని గోడు ఎవరూ వినలేదు. చదరంగంలో పావులాగా వాళ్లు ఆడించినట్టే ఆడక తప్పలేదు. కాశీనాథ్‌కు, అతని వాదనలన్నీ కొట్టిపారేసారు. పెళ్లి ఏర్పాట్లు, ఉత్సవాలు వాటంతట అవి జరిగిపోయాయి. 8 ఏళ్ల దుర్గాభాయి కాశీనాథ్‌కు భార్య అయింది. ఆ రోజుల్లో హిందువులు తమ బాలబాలికలు లైంగికమైన పతనానికి లోనుకాకూడదన్న పట్టుదలతో యీ బాల్య

వివాహాలు చేసేవారు. కానీ, యీ నిర్ణయాలు పిల్లల భవిష్యత్తు మీదా, ఆర్థికస్థితి మీద చాలా ప్రభావాన్ని చూపించేవి. యువతీయువకులకు వివాహాలు చేసి బాధ్యత మీద పడేట్లు చేస్తే నీళ్లలో పడితే ఈత నేర్చుకున్నట్లే సంసారం ఈదటం నేర్చుకుంటారు.

కానీ, కాశీనాథ్ విషయంలో మాత్రం తల్లిదండ్రుల ఆశలు, అంచనాలు అన్నీ ఆవిరైపోయాయి. అతను ఎప్పటిలాగే చదువు సంధ్యలు లేకుండా, బ్రతుకుదెరువు గురించి ఆలోచించకుండా మూర్ఖంగానే ఉన్నాడు. సహృదయులైన బంధువులు అతని విధానాలను మార్చడానికి హాస్యోక్తులాడుతూ, ఇతను అడుగుపెట్టిన వేళావిశేషం మంచిదే, బోలెడంత ధనం కలిసొచ్చి, బోలెడన్ని నగలు చేయిస్తాడని అంటుండేవారు. ముళ్ళు, కర్రపోట్ల వంటి యీ మాటలు అతనిలోని స్తబ్ధత్వాన్ని తన కఠోరలక్ష్యంవైపు మరింత గాఢాసక్తిని కలిగించాయి. వైవాహిక జీవితం అతని విషాదాన్ని మరింత పెంచి జీవితానికి చేదురుచినే ఇచ్చింది. రానురాను అతని పట్ల క్రూరమైన ఒత్తిడి పెరిగిపోయింది. అతను సతాన తాతగారి దగ్గరకు వెళ్లి ఇంట్లో ఉండటం చాలా కష్టమైపోతుందని, ఇంటికి దూరంగా ఎక్కడైనా పర్యటిస్తే బాగుంటుందని చెప్పకున్నాడు. అందుచేత అతన్ని ధూలియా పంపించారు. స్థలం మార్పిడి, తల్లిదండ్రులతో గడపడం అతనికి కొంత ఉపశాంతిని కలిగించవచ్చనుకున్నారు తాతగారు. ధూలియాలో కూడా అతడేమీ అధ్యయనం చేయలేదు. ఇల్లు వదిలి గంటల తరబడి మాయమైపోయేవాడు. మహాదేవ మందిరంలోని మంటపంలో ఒక నేల మాళిగలో ధ్యానం చేస్తూ ఉండిపోయేవాడు. ఒకరోజు ప్రొద్దున్నే ఒక కాగితం మీద తాను ఇల్లు వదిలి వెళ్లిపోవడానికి గల కారణాలన్నీ వ్రాసి అందరికీ కనిపించే చోట పెట్టి పారిపోయాడు. పట్టుబడతానన్న భయంతో పది మైళ్ళు ఒక్క పరుగున వెళ్లిపోయాడు. అటుపైన 4 రోజుల్లో 80 కి.మీ ప్రయాణించి నాసిక్ చేరుకున్నారు. అతని తల్లిదండ్రులకు యితను యిలా చేస్తాడని





ముందునుంచే సందేహం ఉంది. ఇది కుటుంబ గౌరవాన్ని చెడగొట్టే పనే. కాని తప్పని దానికి బాధపడి లాభం ఏముంది. ఆ చేదుని వారు మౌనంగా మింగేసారు. నాసిక్ చేరాక కాశీనాథ్‌కి ఇంటి గురించీ, తన తల్లిదండ్రులు తన కోసం పడే ఆరాటం గురించి ఆలోచనలు కలుగ సాగాయి. అతను అందుచేత తాను నాసిక్‌లో తమ కుటుంబ మిత్రుల దగ్గర ఉంటున్నానని ఉత్తరం వ్రాసాడు. అటుపైన రెండు నెలలకు తల్లి జబ్బు పడిందని తెలిసి తిరిగి ఇంటికి వచ్చాడు.

అటుపై కొద్దికాలానికి అతని భార్య మరణించింది. కానీ, అతని ఏకాంత వాసం ఎక్కువకాలం గడవలేదు. భార్య పోయిన కొద్దివారాలకే కాశీనాథ్‌కు మరో వివాహం జరిగింది. పెద్దలకు, యీ వధూవరులకు కూడా జరిగిందంతా స్పష్టంగానే తెలుసు. కళ్ళారా సత్యాన్ని చూస్తూనే యీ వివాహం జరిపితే యీ పాపం లేదా గొప్పతనం ఎవరికి చెందాలో అర్థం కాదు. 15 ఏళ్ల కాశీనాథ్ 9 ఏళ్ల అతని భార్య చదరంగంలో పావుల్లాగా కదపబడ్డారు. ఓ ఏడాది గడిచింది. తన చేదు అనుభవాలతో కాశీనాథ్ మళ్లీ భార్యను విడిచి అక్కడక్కడా తిరగసాగాడు.

ఆ ఇల్లాలు దాదాపు 7 సం॥ అతని ఇంట్లోనే పడిఉంది. కొన్నాళ్ళు ఏవో పనులు చేసుకుంటూ, కొన్నాళ్ళు భిక్ష మెత్తుకుంటూ, తరువాత అతను అప్పడప్పడు అరుదుగా ఇంటికి వస్తూ తిరుగుతూ ఉన్నాడు. భరించరాని పేదరికం, యాచన మొదలైన పరిస్థితులతో కాశీనాథ్ జీవితం బాధాకరంగా నడిచింది. నిర్లక్ష్యం, తిరస్కారం మొదలైన వాటితో అతని జీవన చిత్రం నిండిపోయింది. తరచుగా కాశీనాథ్ తన కర్మను నిందించుకుంటూ ఉండేవాడు. తాను గత జన్మలలో మహాపాపాలు ఏం చేశాడో, భగవంతుడు తన పట్ల ఎందుకు అంత కౄరంగా ప్రవర్తిస్తున్నాడో అని బాధపడ్డాడు. అప్పడతనికి జవాబు దొరకలేదు. చాలాకాలానికి యీ కష్టాలు ఎందుకు వచ్చాయో? ఈ కఠినపరీక్ష తనకు అర్థం అయ్యింది.

నిపుణుడైన శిల్పి తాను తయారుచేసే పాలరాతి బొమ్మ మీద అనవసరంగా ఒక దెబ్బ కూడా వేయడు. సమర్థుడైన వైద్యుడు రోగికి అవసరం మించి ఒక్క మాత్ర కూడా ఎక్కువ ఇవ్వడు. ఒలింపిక్ ఆటలలో ఆడవలసిన అభ్యర్థికి అవసరమైన దానికంటే పనికిరాని శిక్షణ జిమ్నాస్టిక్ శిక్షకుడు ఇవ్వనే ఇవ్వడు. కాశీనాథ్ తనకు వచ్చిన యీ విపన్మేఘాలన్నీ తన మీది కరుణతో పరమాత్ముడిచ్చిన ఆశీర్వచనాలే అని ఆయన ఆశించాడు. అయితే అప్పటి రోజుల్లో ఆ కారుమబ్బులు అతని జీవనాకాశం నిండా నిండి యీ చిన్న ఆశాకిరణాన్నిగానీ, దాని ఆంతర్యం గురించిన ఆలోచనగానీ ఇవ్వలేదు. ఇన్నిరోజులపాటు రోజుకు ఒక్కపూటైనా తిండిలేక వేపాకుతో నూరిన ముద్దతోను, నదిలోని నీళ్లతోను ఆకలి తీర్చుకున్నానని అతనికి తెలుసు. ఎన్నిరాత్రులు ఓ ధర్మశాల, ఓ ఆసుపత్రి వరండా కూడా కనిపించక ఏ చెట్టు క్రిందో, ఏ ఆరుబయటో, తన చెయ్యే తలగడగా, ఒంటి మీద బట్టలే దుప్పట్లుగా నిద్రపోవలసి వచ్చిందో! ఇక అతని చుట్టూ ఉన్న సహచరులు ఏ విలువలు, సిద్ధాంతాలు లేక ఎంగిలిమెతుకుల కోసం కొట్లాడుకునే భిక్షగాళ్లే!

దుఃఖపు కొలిమిలో బాగా కాలినపుడే అచ్చమైన, దృఢమైన మనిషి తయారవుతాడు. సల్లిలిఫ్ సిడ్నీ యుద్ధరంగంలో శరీరమంతా గాయాలతో పడి ఉండి, తనకు అపురూపంగా దొరికిన గుక్కెడు నీళ్లను మృత్యు ముఖంలో ఉన్న సామాన్య సైనికుడికి యిస్తూ "నాకన్నా నీకే యీ నీళ్లు ఎక్కువ అవసరం" అన్నారు. ఆ రోజుల్లో కాశీనాథ్ సాటిలేని భిక్షగాళ్ల పట్ల చూపిన ఆదరణ ఆయన పదేపదే గుర్తు చేసుకుంటారు. ఆయన మూడు రోజులపాటు ఆకలితో మాడే భిక్షగాళ్లతోపాటు ఒక్క మెతుకైనా లేకుండా గడపవలసి వచ్చింది. నాలుగవ రోజున ఒక దయ గల తల్లి అతనికి పూర్తి భోజనం పెట్టింది. ఆ మర్నాడు, ఇంకా ఎక్కువ పెట్టింది. మూడవనాడు నుంచి అతను ఆమె యిచ్చిన ఆహారం తీసుకుని దేవాలయం దగ్గరున్న





యాచకులందరికీ పంచసాగారు. అతన్ని చూసి అబ్బురపడిన ఇల్లాలు వాళ్లందరికీ సరిపడే భోజనం పంపసాగింది. ఒక్కనెలలో 1000మంది కడుపునింపసాగింది. కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేసే వారిని కాశీనాథ్ ఎప్పడూ వదులుకునేవాడు కాదు. అలాగే పవిత్రులు, సాధు జీవనులు దొరికితే వారి చెంత కూర్చుని చేదు పూల నుంచి కూడా చుక్క చుక్కగా తేనె పోగుచేసుకుని తేనెటీగలాగా జ్ఞానాన్ని నేర్చుకోకుండా వదిలేవాడు కూడా కాదు. ఆ తర్వాత తను యాచకమిత్రులను, పూనా నగరాన్ని విడిచి ఒక సాధు బ్రహ్మచారి వెంట వెళ్లిపోయాడు. ఆయన బ్రహ్మచర్యం యొక్క గొప్పతనం గూర్చి, శివారాధన ఘనత గూర్చి ఎన్నో విషయాలు బోధించాడు. కాశీనాథ్ తదుపరి జీవితంపై అతని ప్రభావం చాలా ఉంది.

**(సశేషం)**

# శ్రీ గజానన విజయం



**- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు**

**(గత సంచిక తరువాయి)**

శ్రీధర్ గోవిందఖాలే అనే కోల్హాపురం నివాసి పేదకుటుంబం నుంచి వచ్చాడు. ఇంగ్లీషు బడి నుండి మెట్రిక్ పాసయినాడు. కానీ, ఇంటర్మీడియట్ తప్పాడు. అతను కేసరి పత్రికలో ఒయామా, టోగో అనే యిద్దరు జపానీయులు ఇంగ్లండు వెళ్లి మెకానికల్ ఇంజనీరింగ్ చదివి క్రొత్త విజ్ఞానంతో స్వదేశానికి వచ్చి మాతృభూమిని సేవించారు. ఇది చదివి గోవింద్‌కాలే భాంద్రాలో మన్రో హైస్కూల్‌లో టీచర్‌గా ఉన్న తన మిత్రుడిని కలుసుకున్నాడు. అతనితో కలసి విదేశాలకు వెళ్లడానికి ఒప్పుకున్నాడు కానీ, అతని దగ్గర కూడా ఒక్క పైస లేదు. విదేశాలకు వెళ్లాలంటే మాటలా! డబ్బులేనిదే ఎలా? వెనక్కు కొల్హాపూరు వెళ్లిపోదామనుకున్నారు. దారిలో

షేగాం‌వ్‌లో దిగారు. గజాననులను దర్శించుకోవాలని. తమ సామాను పోస్ట్‌మాస్టరు దగ్గర పెట్టుకొని ఆశ్రమానికి వెళ్లారు. మహరాజును చూడగానే సాష్టాంగ నమస్కారం చేసారు.

స్వామి వాళ్ల హృదయాలు చదివారు. ఇలా అన్నారు - "ఓరి వెర్రివాళ్ల లారా, విదేశాలకు వెళ్లటం దేనికి? ప్రతిదీ యిక్కడే ఉంది. భౌతిక సంపదకై వెంపరలాడకండి - ఆధ్యాత్మిక జీవనపు లోతులలోకి వెళ్లండి". సరిగ్గా యిలాటి భావాలే కొల్హాపూరు స్వామి ఒకరు వెలిబుచ్చటం గుర్తు చేసుకున్నాడు శ్రీధర్. అవే పంక్తులు సరిగ్గా గజాననులు చెప్పటం విని అతడు కొంచెం తికమకపడ్డాడు.

"భారతదేశాన్ని విడిచి వెళ్లకండి - ఇక్కడ పుట్టటమే ఎంతో అదృష్టం. ఈ గడ్డను ప్రేమించండి" అన్నారు మహరాజు మళ్లీ. ఈ మాటలు శ్రీదర్ కళ్లు తెరిపించాయి. అతని మనసు మారిపోయింది. యోగులు చాలా గొప్పవారు. వారు మన ఆలోచనా ప్రవాహపు గతి మార్చగలరు. వాళ్లకు సత్యం తెలుసు. గజాననులు శ్రీధర్‌ను త్వరగా యింటికి వెళ్లమనీ, అతని భార్య ఆతురతతో ఉన్నదనీ చెప్పారు. అతను అలాగే తిరిగి వెళ్లి, తిరిగి చదువుకోవటం ప్రారంభించాడు. అటుపై కొంతకాలానికి అతడు గ్వాలియర్ జిల్లాలోని శివపురిలో కళాశాల ప్రధానాధ్యాపకుడిగా నియమితుడైనాడు.

యోగులు కంటికి కనిపించే దేవుళ్లు. వారి ఆశీస్సులు ఎన్నో చమత్కారాలు చెయ్యగలవు. గజాననుల ఆశీస్సులతో శ్రీధర్ ఉన్నతస్థాయికి చేరుకోగలిగాడు. ఈ భరతభూమి గొప్పది. ఇక్కడే యోగులు జన్మిస్తారు. ఈ పవిత్రమైన గడ్డపై పెరిగే చెట్లు మరెక్కడా పెరగవు. ఈ గజాననుల విజయం భక్తులకు సన్మార్గం చూపును గాక!

**(15వ అధ్యాయం సమాప్తం)**

**(సశేషం)**







# మంగళాక్షతలు



**శ్రీమతి ఏచూరి శాంత, శ్రీ రవీంద్రరావుగారలు** సాయిధామాని కెంతో దగ్గరివారు. ఇంజనీర్‌గా రవీంద్రరావుగారు ఆశ్రమానికిచ్చిన సహకారం ఎంతో గొప్పది. గురుదేవుల గదిలో వేడి ఎక్కువగా ఉన్నదని గమనించి ఆ మరునాడే వర్కర్స్‌తో సహా ఎ.సి. మిషన్ పంపించి, గదిలో బిగింపజేసి మాదిరి అభిమానం ఆయనది. ఏ వేళలోనైనా సేవకు సంసిద్ధులేవారు. ఆ దంపతులు తమ పెద్దకుమార్తె చి॥సౌ॥ ఎ.ఇ.దీప్తికి చి॥ పి.ఆనందకుమార్‌తో కళ్యాణక్రతువు నిర్వహించారు. **'16 ఆగస్టు 22వ తేదీ ఉదయం 6 గం.కు - చెన్నైలోని శ్రీరామ కళ్యాణ మంటపంలో వైభవంగా జరిగిన యీ వివాహంతో** జతపడిన యీ నవదంపతుల జీవితాలు కలకాలం రెండూ ఒక్కటిగా వర్ధిల్లాలనీ, వారు సత్సంతానాన్ని కని, పెంచి, సద్ధర్మపరులుగా తీర్చిదిద్ది, దేశమాత ఋణాన్ని తీర్చుకోవాలనీ, తద్వారా అటు వారికీ, యిటు వారికీ కూడా ఆనందాన్ని కలిగించాలనీ సాయివాణి గురుదేవుల పేరిట ఆశీస్సులు అందిస్తున్నది.

**ప్రసన్న హృదయం**

**మందస్మిత వదనం**

**మధుర వచనం**

**ఇవి మూడే మనిషికి సౌందర్యం**

